## వర్క్ షాప్‌ను విజయవంతం చేయాలి

మన్సురాబాద్, మార్చి 6: రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో ఈనెల 10, 11, 12 తేదీలలో నిర్వహించే దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్రస్థాయి వర్క్ షాప్ ను విజయవంతం చేయాలని దళిత హక్కుల పోరాట సమితి ఎల్బీనగర్ నియోజకవర్గం కార్యదర్శి సురేందర్ ఒక ప్రకటనలో కోరారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 78 సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ నేటికి దళితులు పై వివక్ష చూపుతూనే ఉన్నారన్నారు. దళితులకు ఉపాధి అవకాశా లను కల్పించుటకు, హక్కులు సాధించుకునేందుకు పోరాట రూపకల్పన కోసం నిర్వహిస్తున్న వర్క్ షాప్ ను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## తాగునీటి సమస్య పరిష్కరించండి

బడంపేట్, మార్చి 6: బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని జెనిగే కొమురయ్య కాలనీలో నీటి సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు కమిషనర్ సరస్వతికి గురువారం వినతి పత్రం అందజేశారు. కాలనీలో గత ఆరు నెలలుగా తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని వారు వివరించారు సమస్యను పరిష్కరించాలని కోరారు.కాలనీలో తాగునీటి సరఫరా అందకుండా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. అధికారులకు పలు మార్లు ఫిర్యాదు చేసినప్పటికీ వారు నిర్లక్ష్యం గా వ్యవహరిస్తున్నారని అన్నారు. నీటి సరఫరా లేకుండానే బిల్లులు వసూలు చేస్తున్నారని అన్నారు. ఒక్కో ఇంటికి రూ. 17వేల బిల్లులు వస్తున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. నీటి వసతి లేకుండా ప్రజలకు బిల్లుల భారంతో వేధించడం అన్యాయమని అన్నారు. కాలనీవాసుల సమస్యను గమనించిన కమిషనర్ రెండు రోజుల్లో తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చార ని వారు తెలిపారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో రాళ్ల గూడెం రామకృష్ణారెడ్డి కాలనీవాసులు తదితరులు ఉన్నారు

## నూతన కార్యవర్గం

వనస్థలిపురం: బీఎన్ రెడ్డి నగర్ డివిజన్ సంత్ సేవాలాల్ మహారాజ్ బంజారాదళ్ సర్వ సభ్య సమావేశం రాష్ట్ర సేవాలాల్ సేన అధ్యక్షుడు ఆంగోత్ రాంబాబు నాయక్ ఆద్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సమావేశంలో నూతన కమిటీ ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా బోడ గన్నా నాయక్, ఇస్లావత్ చందు నాయక్, అధ్యక్షుడిగా పాతులోతు రామకోటి నాయక్, ఉపాధ్యక్షులుగా నేనావత్ సూర్య నాయక్, కేతావత్ అమర్సన్ నాయక్, వర్కింగ్ ప్రెసిడెంటుగా నేనావత్ రవికుమార్ నాయక్, ప్రధాన కార్యదర్శిగా రాత్లావత్ భరత్ లాల్ నాయక్, కోశాధికారిగా భుక్య రామా నాయక్, సహాయ కార్యదర్శిగా రామావత్ రవి నాయక్, కార్య నిర్వాహక కార్యదర్శిగా కరంటోత్ రమేశ్ నాయక్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు రామకోటి నాయక్ మాట్లాడుతు దేశంలో దాదాపు 20 కోట్ల మంది బంజారాల ఆరాధ్య దైవంగా పూజించే సద్గురు సంత్ సేవలాల్ మహారాజ్ అందరిని ఏక్ జాత్, ఏక్ వాత్, ఏక్ సాత్ అనే నినాదంతో ఒకతాటిపై నడిపించారన్నారు. జీవన విధానాన్ని బోధించిన సామాజిక ,ఆధ్యాత్మిక యోధుడు అని కొనియాడారు. బంజార సహోదరులందరికీ అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరించే దిశగా కృషి చేస్తామన్నారు.

# వెలవెలబోతున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు

- కుదేలైన రియల్ ఎస్టేట్ రంగం
- బీఆర్ఎస్ హయాంలో కిటకిటలాడిన కార్యాలయాలు
- ప్రస్తుతం 10 నుంచి 15 వరకు మాత్రమే రిజిస్ట్రేషన్లు




హయత్ నగర్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం

హయత్ నగర్, మార్చి 6 : కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం కుదేలయింది. దీంతో రియల్ ఎస్టేట్ వ్యాపారులు, మధ్యవర్తులు అయోమయానికి గురవుతున్నారు. హైడ్రా కూల్చివేతలు, ఎల్ఆర్ఎస్ సమస్యల కారణంగా ప్రస్తుతం రియల్ ఎస్టేట్ మార్కెట్ పడిపోయింది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కిటకిటలాడిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు నేడు వెలవెలబోతున్నాయి. హైదరాబాద్ నగర శివారు ప్రాంతమైన హయత్ నగర్ పట్టణం రోజు రోజుకు అభివృద్ధి చెందుతోంది. హైడ్రా కూల్చివేతలు కారణంగా పేద మధ్య తరగతి ప్రజలు ప్లాట్లు, ఇల్లు కొనుగోలు చేసేందుకు సుముకత చూపడం లేదు. కష్టపడి డబ్బులు పెట్టి ప్లాట్లు, ఇంటిని కొనుగోలు చేస్తే ఎలాంటి సమస్యలు ఎదురవుతాయోనని ఆందోళనకు గురవుతున్నారు.

**పదుల సంఖ్యలో డాక్యుమెంట్లు...**

నగర శివారు ప్రాంతమైన హయత్ నగర్ సబ్ రిస్ట్రార్ కార్యాలయంలో రోజుకు 10 నుంచి 15 వరకు మాత్రమే రిజిస్ట్రేషన్లు అవుతున్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వంలో రోజుకు 30 నుంచి 40 వరకు రిజిస్ట్రేషన్లు జరిగేవి. ప్రస్తుతం నెలకు దాదాపు 500 వరకు రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. గతంలో నెలకు 600 నుంచి 900 వరకు రిజిస్ట్రేషన్లు జరిగేవి. గ్రామ కంఠం, ఎల్ఆర్ఎస్ లో లొసుగులు కారణంగా రిజిస్ట్రేషన్లు చేసుకోవడానికి కొనుగోలుదారులు భయాందోళనకు గురవుతున్నారు.

**వనస్థలిపురం సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో..**

ఎల్బీనగర్: వనస్థలిపురం సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో హైడ్రా కంటే ముందు రోజుకు 50 నుంచి 60 రిజిస్ట్రేషనుల జరిగేవి. ప్రస్తుతం 30 నుంచి 35 రిజిస్ట్రేషనుల మాత్రమే జరుగుతున్నాయి. సాగర్ రింగ్ రోడ్డు లోని ఎల్బీనగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో గతంలో 70 నుంచి 80 రిజిస్ట్రేషన్లు జరిగేవి ప్రస్తుతం 40 నుంచి 45 రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి.

### నెమ్మదిగా రిజిస్ట్రేషన్లు



హయత్ నగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రస్తుతం భూ రిజిస్ట్రేషన్లు నెమ్మదిగా సాగుతున్నాయి. గతంలో రిజిస్ట్రేషన్లు అధిక సంఖ్యలో జరిగేవి. ప్రభుత్వం తీసుకొచ్చిన ఎల్ఆర్ఎస్ చెల్లించిన ప్లాట్లకు రిజిస్ట్రేషన్లు చేస్తున్నాం. ప్రజలు ఎలాంటి అపోహలకు గురికావొద్దు.

– పాండు, ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్

## వెంకటేశ్వర కాలనీ సమస్యలు పరిష్కరించాలి



ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న కాలనీ వాసులు

ఆర్కే పురం, మార్చి 6: సరూర్‌నగర్ డివిజన్ వెంకటేశ్వర కాలనీలోని ని సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు మాజీమంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని గురువారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు ధనం రెడ్డి, జనరల్ సెక్రటరీ కనక రావు , వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ రావు , ట్రెసరర్ సాయి కిరణ్ , కాలనీ సభ్యులు విజయ కుమార్, బలరాజ్‌గుప్తా, మాధవ రావు, సుధాకర్, నరేశ్, శ్యామ్ సుందర్, ప్రతాప్ రెడ్డి, గోవర్ధన్ పాల్గొన్నారు.

## మూసీలో ఫెన్సింగ్ పనులు ప్రారంభం



కొలతలు తీసుకుంటున్న సంబంధిత కాంట్రాక్టర్

మలక్ పేట మార్చి 6: మూసీ సుందరీకరణలో భాగంగా పాత మలక్ పేట డివిజన్ లోని శంకర్ నగర్, చాదర్ ఘాట్ లోని మూసా నగర్ లలో మూసీ నిర్వాసితుల ఇండ్లను కూల్చివేసి లెవలింగ్ చేసిన అధికారులు మూసీ బెడ్ వరకు ఫెన్సింగ్ ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టారు. అప్పట్లో మూసీ నిర్వాసితులను తరలించి ఇండ్లను పాక్షికంగా కూల్చివేసి అలాగే వదిలేయడంతో ఆ ప్రాంతమంతా మురికి, చెత్తా, చెదారాలతో నిండి దుర్వాసన వస్తుండటంతో పరిసర కాలనీల ప్రజలు సమస్యను మలక్ పేట ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన ఎంఆర్‌డీసీఎల్ అధికారులతో మాట్లాడి పాక్షికంగా కూల్చివేసిన ఇండ్లను పూర్తిగా నేలమట్టం చేసి, ఆ ప్రాంతమంతా చదును చేసి గోడను నిర్మించాలని కోరడంతో అందుకు అంగీకరించిన అధికారులు ఆయా పనుల నిమిత్తం రూ.3 కోట్ల నిధులు మంజూరు చేశారు. దీంతో మొన్నటి వరకు ఇళ్లను కూల్చివేసి చదును చేసిన సంబంధిత కాంట్రాక్టర్ ఇప్పుడు మూసీ బెడ్‌లో ఫెన్సింగ్ వాల్ నిర్మించేందుకు మెజర్మెంట్స్ సేకరించి పనులు చేపట్టారు. గురువారం పాత మలక్ పేట డివిజన్ లోని శంకర్ నగర్ లో ఫెన్సింగ్‌వాల్ నిర్మించే ప్రదేశంలో వాల్ నిర్మాణానికి మార్కింగ్ చేశారు. త్వరలోనే గోడ నిర్మాణ పనులు చేపట్టనున్నామని వారు పేర్కొన్నారు. గోల్నాక న్యూ బ్రిడ్జి నుంచి తీగల గూడా వరకు నిర్మించిన విధంగా ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేయనున్నామని, దీంతో మూసీలో ఆక్రమణలు నిలిచిపోవడమే కాకుండా చెత్తా, చెదారం డంపులను కూడా అరికట్టవచ్చునని అన్నారు.

# ఎరువులు అందుబాటులో ఉంచాలి



మందుల దుకాణాన్ని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి నరసింహారావు

కందుకూరు, మార్చి : రైతులకు యాసంగిలో ఎరువుల కొరత రాకుండా ముందస్తుగా చర్యలు తీసుకొని ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అందుబాటులో ఉంచాలని రంగారెడ్డి జిల్లా వ్యవసాయ అధికారి నరసింహారావు తెలిపారు. గురువారం పీఏసీఎస్ కార్యాలయం తో పాటు మండల కేంద్రంలో మందుల దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణ యజమానుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పీఏసీఎస్ కార్యాలయంలో 96 టన్నులు, వివిధ మందుల షాపుల్లో 90 టన్నుల యూరియా అందుబాటులో ఉన్నట్టు గుర్తించారు. వరి, మొక్కజొన్న, కూరగాయల పంటలకు సరిపడా నిల్వలు ఉన్నట్లు తెలిపారు. యూరియా విషయంలో రైతులు ఆందోళన చెందవద్దని పేర్కొన్నారు .రైతులకు కావాల్సిన యూరియా నిల్వలు ఉన్నాయని వివరించారు.మందుల షాపులు యజమానులు యూరియా కొరత సృష్టించకుండా ఈ నెలాఖరు వరకు యూరియా డిమాండ్ ఉందని కొరత లేకుండా ముందస్తుగా చర్యలు తీసుకోవాల్సిందిగా మండల వ్యవసాయ అధికారి లావణ్య కు సూచించారు. రైతులకు ఇబ్బందులు కలుగ కుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో మండల పీఏసీఎస్ చైర్మన్ దేవరశెట్టి చంద్రశేఖర్, మండల వ్యవసాయ అధికారి లావణ్య , పీఏసీఎస్ కార్యదర్శి నిమ్మ యాదగిరి రెడ్డి మందుల షాపుల యజమానులు పాల్గొన్నారు.

## అంధ బాలికలకు పరీక్ష కిట్లు పంపిణీ



సైదాబాద్ మార్చి 6 : మలక్ పేట బీ బ్లాక్ లోని ప్రభుత్వ అంధ బాలికల పాఠశాలలోని పదో తరగతి అంధ బాలబాలికలకు, దారుశాఫా లోని బాలుర పాఠశాలలో ఇక్షణ ఫౌండేషన్ సంస్థ విద్యార్థులకు పరీక్షలు రాయడానికి కావలసిన పరీక్ష కిట్స్ ను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధి రాజశేఖర్ రెడ్డి హాజరై విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పీఆర్‌టీ. యూ జిల్లా ఉపాధ్యక్షులు మందడి వెంకట్ రెడ్డి తదితులు పాల్గొన్నారు.

## సమస్యాత్మక ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలి



మీర్‌పేట్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న కమిషనర్ సుధీర్ బాబు

బడంగ్ పేట్, మార్చి 6 : రాచకొండ కమిషనరేట్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా వివిధ పోలీసు స్టేషన్లలో అధికారుల సిబ్బంది పనితీరును తెలుసుకోవడానికి కమిషనర్ సుధీర్ బాబు గురువారం రాత్రి మీర్ పేట్ పోలీస్ స్టేషన్ ను ఆకస్మిక తనిఖీ చేశారు. విజిబుల్ పోలీసింగ్ కార్యక్రమంలో స్వయంగా పాల్గొని స్థానిక ప్రజలతో కలిసి మాట్లాడారు. వారి స్పందనను తెలుసుకున్నారు. వేలి ముద్రల ద్వారా నేరస్తులను గుర్తించేందుకు ఉపయోగించే అత్యధిక సాంకేతిక పరికరం ప్రీ ప్లాన్ ను స్వయంగా పరీక్షించారు. స్టేషన్ లో, ఉన్న రికార్డులను పరిశీలించారు. రిసెప్షన్, పెట్రోలింగ్ స్టాఫ్ వంటి పలు విభాగాల పనితీరు, సీసీటీవీల నిర్వహణ వంటి అంశాలను సమీక్షించారు. సమస్యాత్మక ప్రాంతాల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. మహిళా భద్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మీర్ పేట్ సీఐ నాగరాజు, ఎస్సైలు తదితరులు ఉన్నారు.

# నిధులు మంజూరు చేయండి



మంత్రి శ్రీధర్ బాబును సన్మానిస్తున్న మాజీ జడ్పీటీసీ జంగారెడ్డి

కందుకూరు ,మార్చి 6: అభివృద్ధికి కృషి చేస్తానని ఐటీ శాఖ శాఖ మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. గురువారం తుక్కుగూడలో డీసీపీ కార్యాలయం శంకుస్థాపనకు వచ్చిన సందర్భంగా ఆయనను కలిసి శాలువాతో సన్మానించిన అనంతరం కందుకూరు మండలం అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని నాయకులు కోరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామాలలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని తెలిపారు. మండలంలో ఫోర్త్ సిటీ ఏర్పాటవుతున్నందున అందుకు అనుగుణంగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ఫోర్త్ సిటీ ఏర్పాటు అయితే ఈ ప్రాంత ప్రజల దిశ మారుతుందని అనానరు. స్థానికులకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని తెలిపారు. కందుకూరు, మహేశ్వరం ,మండలాలకు అభివృద్ధి కోసం రూ. 12 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ పట్నం మహేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి, టీయూఎఫ్ఐడీసీ చైర్మన్ చల్ల నర్సింహా రెడ్డి, పీసీసీ మెంబర్ దేపా భాస్కర్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా పరిషత్ మాజీ ఫ్లోర్ లీడర్ ఏనుగు జంగారెడ్డి, కృష్ణా నాయక్ , వర్కింగ్ ప్రెసిడెంట్ కోరుప్రోలు రాణా ప్రతాప్ రెడ్డి, శ్రీధర్ ముదిరాజ్, కంబాల పల్లి విష్ణువర్ధన్ రెడ్డి, ఎండీ అఫ్జల్ బేగ్ , సరికొండ జగన్, పాండు, బొమ్మ కూరు ప్రశాంత్ కుమార్, రాకేశ్‌గౌడ్,మహేందర్, మస్తాన్ పాల్గొన్నారు

# సమస్యలను పరిష్కరించాలి



ఆకులమైలారంలో సమస్యలు తెలుసుకుంటున్న రామ్‌చందర్

కందుకూరు ,మార్చి 6: ఫార్మా రైతులకు ఇచ్చిన పట్టాలకు కబ్జా చూపించాలని సీపీఎం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు దుబ్బాక రామ్‌చందర్ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం మండల పరిధిలోని ఆకుల మైలారం గ్రామ శాఖ ఆధ్వర్యంలో ఇంటింటికీ సర్వేలో భాగంగా గ్రామంలో పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు. ఇళ్ల స్థలాల సమస్య, రేషన్ కార్డులు, పింఛన్లు కరెంటు జీరో బిల్లుల సమస్య, ఫార్మా ఇళ్ల స్థలాల సమస్యలు, పీఓటీ భూముల సమస్యలు వారి దృష్టికి తీసుకువచ్చారు. రోడ్లపై ప్రవహిస్తున్న మురుగు నీటి సమస్యను పరిష్కరించాలని పంచాయితీ అధికారి గీత, పంచాయతీ కార్యదర్శిలతో, ఫోన్లో మాట్లాడి పరిష్కరించే విధంగా కృషి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్ కార్డులు,పింఛన్లు ఇండ్లు రాక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారని తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం సమస్యలను తాత్సారం చేస్తుందని అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వం ప్రజల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఫార్మాసిటీ రైతులకు ప్లాట్ చూయించారు కానీ కబ్జా చూపలేదని వెంటనే కబ్జా చూపాలని కోరారు. కార్యక్రమంలో శాఖ కార్యదర్శి నోముల నరసింహ,సభ్యులు మహేందర్,అచ్చన శివయ్య,రవీందర్ పాల్గొన్నారు.

## భోజిరెడ్డి కాలేజీలో సాంకేతిక ఉత్సవం




సిటీ బ్యూరో, మార్చి 6 (నమస్తే తెలంగాణ): భోజిరెడ్డి మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో రెండు రోజుల జాతీయ స్థాయి సాంకేతిక ఉత్సవం, జిజ్ఞాస-2025ను నిర్వహిస్తున్నారు. ఈ ఉత్సవాలు గురువారం ప్రారంభమై నేటితో ముగియనున్నాయి. పలు రకాల్లో పోటీల్లో 630 మంది వివిధ రాష్ట్రాల విద్యార్థులు పాల్గొంటున్నారు. ముఖ్య అతిథులుగా టీజీసీహెచ్‌ఈ సెక్రటరీ ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేశ్ జేఎన్‌టీయూ ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ ఇన్నోవేషన్ అండ్ స్టార్టప్ డైరెక్టర్ ఆర్ శ్రీదేవి, కళాశాల సెక్రటరీ సుధ, సీఓఓ సుజాత గంగాధర్, ప్రిన్సిపాల్ మాధవన్, అకడమిక్ డైరెక్టర్ గ్రేసి శైలశ్రీ, వైస్ ప్రిన్సిపాల్ దయాకర్‌రెడ్డి, ప్రొఫెసర్ శ్రీదేవి, కన్వీనర్ దీప్తి, మంజు భార్గవి పాల్గొన్నారు.

## హైవే కాలనీలోకి వెళ్లే మార్గాన్ని పునరుద్ధరించండి



మార్గాన్ని మూసివేసిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డి

మన్సురాబాద్, మార్చి 6: జాతీయ రహదారి నుంచి హైవే కాలనీలోకి వెళ్లే మార్గాన్ని మూసి వేయడం వల్ల ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని మన్సురాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డి తెలిపారు. జాతీయ రహదారి నుంచి హైవే కాలనీలోకి వెళ్లే మార్గంలో సిమెంట్ దిమ్మెలను ఏర్పాటు చేసిన ప్రాంతాన్ని గురువారం కాలనీవాసులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీలోకి రాకపోకలకు ఇబ్బందిగా ఉన్న దిమ్మెలను అధికారులు వెంటనే తొలగించాలని లేనిపక్షంలో తామే తొలగిస్తామని తెలిపారు. జాతీయ రహదారి నుంచి కాలనీకి వెళ్లే మార్గాన్ని మూసివేసి సదర ప్రాంతంలో సైకిల్ ట్రాక్ వేశారని తెలిపారు. సైకిల్ ట్రాక్ నిరుపయోగంగా మారడమే కాకుండా దానిపై తోపుడు బండ్లు పెట్టడం వలన చిరు వ్యాపారులకు కేంద్రంగా మారిపోయిందని పేర్కొన్నారు. సదరు ప్రాంతంలో ఉన్న వాణిజ్య సముదాయాలకు పార్కింగ్ లేకపోవడం వల్ల రోడ్లపైనే వాహనాలు నిలుపుతూ హైవే కాలనీవాసులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు. సరైన పార్కింగ్ లేని వారిచే సముదాయాలపై చర్యలు తీసుకోవడంతో పాటు హైవే కాలనీకి వెళ్లే మార్గాన్ని పునరుద్ధరించే దిశగా అధికారులు చొరవ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు విజయభాస్కర్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, వెంకట్ యాదవ్, రవి, హరీశ్‌రెడ్డి, సాగర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారుల అక్రమ రవాణా కేసులో మహిళ అరెస్టు

ఎల్బీనగర్ మార్చి 6: చిన్నారులను గుజరాత్ నుంచి నగరానికి తరలించి అమ్మకాలు చేస్తున్న గ్యాంగ్‌లో ప్రధాన నిందితురాలు వందనాబెన్ జిగర్భాయ పంచల్ (వందన) ను గుజరాత్‌లో అరెస్ట్ చేశారు. చైతన్యపురి పోలీసుల కథనం ప్రకారం.. నగరంలో చిన్నారులను విక్రయించే గ్యాంగ్‌ను పోలీసులు ఇప్పటికే 14 మందిని అరెస్ట్ చేయగా తాజాగా ప్రధాన నిందితులు వందనను అహ్మదాబాద్ వెళ్లిన పోలీసులు బృందం అరెస్ట్ చేసి రిమాండ్ కి తరలించారు.

## ఇఫ్లూ వీసీగా ప్రొఫెసర్ నాగరాజు

ఉస్మానియా యూనివర్సిటీ: ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ (ఇఫ్లూ) నూతన వీసీగా ప్రొఫెసర్ నాగలపల్లి నాగరాజు నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర విద్యా శాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన ఈ పదవిలో ఐదేళ్లు గానీ, ఆయనకు 70 ఏళ్ల వయసు వచ్చేవరకు గానీ (ఏది ముందైతే అది) ఉండనున్నారు. ఇంగ్లీష్ సాహిత్యం విభాగానికి చెందిన ఆయన ప్రస్తుతం ఒడిశాలోని గంగాధర్ మెహర్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్గా సేవలు అందిస్తున్నారు. ఆయన సుదీర్ఘకాలం సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ కర్ణాటకలో అధ్యాపకుడిగా బాధ్యతలు నిర్వర్తించారు.

## తల్లీకూతురు అదృశ్యం



గుమ్మడి ఆశ



నిఖిత

హయత్ నగర్, మార్చి 6: ఇంట్లో భర్తతో గొడవపడి భార్య, కూతురుతో కలిసి అదృశ్యమైన ఘటన హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం పెద్ద అంబర్‌పేట్ మున్సిపాలిటీ, కుంట్లూరు రావి నారాయణరెడ్డి కాలనీలో గుమ్మడి ఆశ, భర్త స్వామి దంపతులకు 2010 లో వివాహం కాగా ఇద్దరు కూతుళ్లు వైష్ణవి, నిఖిత ఉన్నారు. భార్యాభర్తలిద్దరూ స్థానికంగా కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. బుధవారం రాత్రి 8 గంటలకు ఆశ ఇన్‌స్టాగ్రాం లో ఎవరితోనో చాటింగ్ చేస్తుంది. గమనించిన భర్త స్వామి ఆమెను నిలదీయగా పొంతనలేని సమాధానం ఇచ్చింది. భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. స్వామి తన భార్యను, కూతురు నికితను తీసుకొని అంజనాద్రి నగర్ లోని తన చెల్లెలు రజిత ఇంటికి తీసుకొచ్చాడు. అనంతరం ఆయన రెడ్డి కాలనీకి వెళ్లాడు. రాత్రి 9:30 గంటలకు రజిత, సోదరుడు స్వామికి ఫోన్ చేసి ఆశ, నికితను తీసుకొని రావినారాయణ రెడ్డి కాలనీకి వెళ్తున్నానని చెప్పి బయలుదేరిందని చెప్పింది. భార్య, కూతురు తిరిగి రాకపోయేసరికి ఆందోళన గురైన స్వామి వారి ఆచూకీ కోసం చుట్టుపక్కల తెలిసిన బంధువుల వద్ద వెతికినా దొరకలేదు. స్వామి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## గుర్తు తెలియని మృతదేహం లభ్యం

హయత్ నగర్, మార్చి 6: గుర్తుతెలియని మృతదేహం లభ్యమైన సంఘటన హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పెద్ద అంబర్‌పేట మున్సిపాలిటీ పరిధిలోని లక్ష్మారెడ్డి పాలెం ఎదురుగా సూర్యవంశం కాలనీ యెయో హోటల్ పక్కన గుర్తు తెలియని వ్యక్తి చనిపోయి ఉన్నాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించగా దాదాపు 40 ఏళ్లు ఉన్న మగ వ్యక్తిగా గుర్తించారు. మృతుడు బ్లూ వైట్ లైన్స్ గల షాట్, లైట్ పింక్ కలర్ షర్ట్ వేసుకొని ఉన్నాడు. మృతదేహాన్ని పరిశీలించిన పోలీసులు యాచకుడిగా గుర్తించారు. మృతుడి వివరాలు తెలిసినవారు హయత్ నగర్ పోలీస్ స్టేషన్ లో సంప్రదించాలని కోరారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## సైన్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ శ్రీనివాస్ నాయక్

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ సైన్స్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ గా కె. శ్రీనివాస్ నాయక్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయనకు ఓయూ విసి ప్రొఫెసర్ కుమార్ నియామక పత్రాన్ని అందజేశారు. సెంటర్ ఫర్ ప్లాంట్ అండ్ మాలిక్యులర్ బయాలజీ (సీపీఎంబీ) లో ఆయన ప్రస్తుతం అసోసియేట్ ప్రొఫెసర్ గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

## ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం

హయత్ నగర్, మార్చి 6 : ప్రమాదవశాత్తు వేర్వేరు చోట్ల అగ్ని ప్రమాదం సంభవించిన సంఘటన హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం సాయంత్రం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హయత్ నగర్ డివిజన్లోని ఆటోనగర్, ద్వారకామై నగర్ ప్రాంతంలోని ఖాళీగా ఉన్న స్థలంలో ఉన్న చెత్తకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారు. కొద్దికొద్దిగా మంటలు అంటుకొని భారీగా ఎగిసిపడ్డాయి. వెంటనే సమాచార అందుకున్న అగ్నిమాపక సిబ్బంది చేరుకొని ఘటనా స్థలంలో మంటలను ఆర్పి వేశారు.

**పెద్ద అంబర్ పేటలో..**

హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పెద్ద అంబర్‌పేట మున్సిపాలిటీ, కళానగర్ కు వెళ్లే దారిలో ఖాళీ ప్రదేశంలో ప్రమాదవశాత్తు మంటలు అంటుకున్నాయి. ఖాళీ ప్రదేశంలో ఉన్న చెత్తాచెదారం, ఎండు గడ్డికి మంటలు అంటుకోవడంతో చుట్టుపక్కలకు వ్యాప్తి చెందాయి. స్థానికుల సమాచారం మేరకు హాయత్‌నగర్ పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది



హుటాహుటిన చేరుకొని మంటలను ఆర్పి వేశారు. ఆయా ఘటనల్లో ఎలాంటి ఆస్తి నష్టం జరగకపోవడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

## ఎంబీఏ కోర్సుల పరీక్ష ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని ఎంబీఏ కోర్సుల పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంబీఏ ఈవినింగ్, ఎంబీఏ టెక్నాలజీ మేనేజ్మెంట్ ఈవినింగ్ కోర్సుల సెమిస్టర్ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు.